# విశాలాంధ్ర గుంటూరు జిల్లా

## సమస్యలను పరిష్కరించండి

- సత్తెనపల్లి, వేమూరు ఎమ్మెల్యేలను కోరిన సెబ్ అధికారులు, సిబ్బంది

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** గుంటూరు జిల్లా సెబ్ అధికారులు, సిబ్బంది సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులను శనివారం కలిసి గత నాలుగు సంవత్సరాలుగా సెబ్/ఎక్సైజ్ శాఖలో నెలకొన్ని ఉన్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఇరువురు ఎమ్మెల్యేలు సెబ్ ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా ఎక్సైజ్ మంత్రితో, ప్రభుత్వంతో చర్చిస్తామని, అలాగే సెబ్‌లో పనిచేస్తున్న ఎక్సైజ్ సిబ్బందిని వారి సొంత శాఖకు పంపించేందుకు, 2019 ముందు ఉన్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించేలా కృషి చేస్తామని తెలిపినట్లు సెబ్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెబ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఈఎస్ ఎల్.రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పి.విజయ్‌కుమార్, లత, ప్రసన్న లక్ష్మీ, సబ్ ఇన్‌స్పెక్టర్లు తులసి, రెహమాన్, రాజేంద్ర, కానిస్టేబుల్స్ లక్ష్మానాయక్, వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి, పూర్ణ, ఆంజనేయులు, దిలీప్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా గాజుల శ్రీనివాసరావు, అందే మురళీమోహన్

**విశాలాంధ్ర-మంగళగిరి :** రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి(2024-2025) నూతన అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శిగా అందె మురళీమోహన్, కోశాధికారిగా వడ్లమూడి శ్రీనివాసరావు నియమితులైనట్లు క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ అందె రేవంత్ తెలిపారు. ఈ మేరకు స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో రేవంత్ వివరాలు వెల్లడించారు. తన పదవీ కాలంలో మంచి సేవా కార్యక్రమాలను నిర్వహించే అవకాశం లభించినట్లు చెప్పారు. ప్రధానంగా దివ్యాంగులకు మంగళకరము 1, 2 పేరిట రెండు విడతలుగా కృత్రిమ చేతుల పంపిణీ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. అలాగే పలు సంతృప్తికరమైన సర్వీసు ప్రాజెక్టులను టీం సభ్యుల సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ట్రైనర్ అనిల్ చక్రవర్తి ఇసునూరు మాట్లాడుతూ రొటేరియన్లు తమ తమ వృత్తి వ్యాపారాలలో బిజీగా ఉన్నప్పటికీ సమాజ హితం కోసం పాటుపడాలనే లక్ష్యంతో సేవ ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు. 2024-2025 నూతన రోటరీ క్లబ్ కార్యవర్గం ఆదివారం సాయంత్రం లిటిల్ విలేజ్ ఫంక్షన్ హాలులో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు చెప్పారు. రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చంద్రచౌదరి డ్రీమ్ ప్రాజెక్టు అయిన సర్వైకల్ క్యాన్సర్ వాక్సినేషన్ సేవా కార్యక్రమాన్ని రోటరీ క్లబ్, రోటరీ కరవాలంబనం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో తొలిసారిగా 'ప్రాజెక్టు శక్తి' పేరిట మంగళగిరిలో చేపడుతుండడం తమకెంతో సంతోషంగా ఉందని అన్నారు. సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి అందె మురళీమోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, సర్వీసు ప్రాజెక్టు డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య పాల్గొన్నారు.

## పెనుమాకలో వింత వ్యాధులు

**విశాలాంధ్ర-తాడేపల్లి :** పెనుమాకలో వింత వ్యాధులు జ్వరాల బాడిన పడి పెయిన్స్ జాయింట్ పెయిన్స్‌తో ఇబ్బందులు పడదుతున్నారు. గత వారం రోజుల నుంచి ప్రజల్లో వ్యాధులు నడవలేక వ్యాధి గ్రస్తులు ఇబ్బందులుపడుతున్నారు. సీజనల్ వ్యాధులా మరేదైనా కొత్త వ్యాధులా అనేది డాక్టర్‌లు కనిపెట్టలేకపోతున్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేసి వ్యాధులు నయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## బుర్రిపాలెం రోడ్డులో కారు ప్రమాదం

**విశాలాంధ్ర- తెనాలి :** తెనాలి నుండి బుర్రిపాలెం వైపు వెడుతున్న కారు అదుపుతప్పి కాల్వలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. శనివారం మధ్యాహ్నం బుర్రిపాలెం రోడ్డులో బిసి కాలని దాటిన తర్వాత పెమ్మసాని పెట్రోల్ బంక్ వద్ద తెనాలి వైపు నుండి బుర్రిపాలెం వైపునకు వెడుతున్న కారు ఓవర్ స్పీడ్‌తో తెడుతున్న ఈ కారు రోడ్డు ప్రక్కన వున్న కటింగ్ షాప్‌ను ఢీకొని కారు బోల్తా కొట్టి పక్కన వున్న సైడ్ కాల్వలో పడిపోయింది. ఇది గమనించిన సమీపంలో వున్న వారు పరుగున వచ్చి కారులో వున్న నలుగురిని బయటకు తీసారు. కారులో వున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. పెద్ద ప్రమాదం తప్పిపోయిందని ఊపిరి పీల్చుకున్నారు. కారు లోపల డాక్టర్‌కి సంబంధించిన శతస్కోప్ మరియు కారు పైన ఆన్‌డ్యూటీ డాక్టర్ అని వ్రాసివున్నది.

## 37.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

**విశాలాంధ్ర-తాడికొండ :** మండలంలో శనివారం వేకువజాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఏకధాటిగా 24 గంటలు వర్షం పడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం దాటికి మురుగునీరు రోడ్లపైకి వచ్చింది. పల్లపు భూములలో వర్షం నీరు చేరింది. పత్తి, పెసర, మినుము, జొన్న, వరి పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది. వర్షం రాకతో పంట పొలాల్లో ఎరువు కట్లను చిమ్మెందుకు రైతులు సిద్ధమయ్యారు. 37.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## శ్రీ వీరాంజనేయస్వామికి గులాబీ గజమాల సమర్పించిన భక్తుడు

**విశాలాంధ్ర-పొన్నూరు :** పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ వీరాంజనేయ స్వామి 24 అడుగుల ఏకశిల ప్రతిమకు శనివారం ప్రకాశం జిల్లా పొదిలి గ్రామానికి చెందిన తెల్లమేకల హనుమంతరావు రిటైర్డ్ డ్రైవర్(ఆర్టీసీ) రూ.30 వేలు ఖర్చుతో ప్రత్యేక ఎర్ర గులాబీలతో గజమాల చేయించి స్వామివారికి సమర్పించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి స్వామి వారి మెడలో అలంకరించారు. ఆలయ ఈవో తుల్లిమిల్లి శ్రీనివాస్ హనుమంతరావును అభినందించారు.

**బహిరంగ ప్రకటన**

మంగళగిరి మండలం, చినకాకాని గ్రామస్తులు దుంపల చంద్రశేఖరరావు గారు, S/o. రంగనాయకులు వయస్సు రిత్యా ది.20-03-2024న స్వర్గస్తులైనారు. వారి కుమారులైన దుంపల రామాంజనేయులు మరియు దుంపల మహాలక్ష్మణ్ గార్లు, చట్టప్రకారం వారసులైనందున వారి తండ్రి గారి ద్వారా సంక్రమించిన వ్యవసాయభూమి, చినకాకాని పంచాయతీ పరిధిలోని మరియు మంగళగిరి పట్టణ పరిదిలోని వ్యవసాయ భూమికి సంబంధించి పాస్ పుస్తకాల కొరకు దరఖాస్తు చేసుకొనగా ఈ విషయాన్ని పత్రికాముఖంగా అధికారులకు మరియు యావన్మందికి తెలియజేయడమైనది.

**ఆస్తి వివరము:** 251/2A1 లో 0.30 సెంట్లు (చినకాకానీ),252/5 లో 1.61 1/2 సెంట్లు, 4/C 2, 5/2 లో 1.16 1/2 సెంట్లు, 2, 3/3 లో 1.40 సెంట్లు( మంగళగిరి).

పై వివరములపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల అధికారులకు గాని, ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు గాని ఫిర్యాదు చేయగలరు. ఫోన్: 9948321671

# ఆగస్ట్ మొదటి వారానికి అన్నా క్యాంటీన్లు సిద్ధం

◆ అధికారులను ఆదేశించిన నగర కమిషనర్

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** ప్రతి పేదవానికి నాణ్యమైన అల్పాహారం, భోజనంను నామమాత్రపు ధరకే అందించేందుకు సంకల్పించిన గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్లను ఆగస్ట్ మొదటి వారానికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో జరుగుతున్న మరమ్మత్తు పనులపై శనివారం ఇంజినీరింగ్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభం చేయనున్నదని, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 8 అన్న క్యాంటీన్లను ఆగస్ట్ మొదటి వారానికి వినియోగంలోకి తీసుకురావడానికి ఇప్పటికే రూ.74 లక్షలతో టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు అనుగుణంగా, నాణ్యతా ప్రమాణాల్లో రాజీలేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. క్యాంటీన్లు ఉన్న ప్రాంతాలలో ఏఈలు పనులను వేగంగా జరిగేలా భాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా పెయింటింగ్, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, స్విచ్ బోర్డ్‌లు, లైట్లు, గ్లాస్ డోర్స్, ఫ్లోర్ మరమ్మత్తులు చేపట్టాలన్నారు. హ్యాండ్ వాష్ పాయింట్స్, నీటి సౌకర్యం పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిపై డీఈఈలు, ఈఈలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, కమిషనర్ చాంబర్‌కి నివేదిక ఇవ్వాలని అన్నారు.

## అధికారులు పనితీరు మార్చుకోవాలి : ఎమ్మెల్యే మాధవి

**విశాలాంధ్ర-గుంటూరు సిటీ:** డ్రైనేజీ, రోడ్ల సమస్యల మీద దృష్టి పెట్టమని పదేపదే అధికారులకు చెప్పిన కూడా పెడచెవిన పెట్టిన మాదిరిగా అధికారుల పనితీరు కనిపిస్తున్నదని, అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతమైన దేవాపరంలో ఎమ్మెల్యే మాధవి శనివారం పర్యటించారు. దేవాపురం 5వ లైన్ లోని పీకలవాగు గోడకు ఆనుకొని ఉన్న 2 బడ్డీకోట్లు వర్షం ధాటికి వాగులో పడిపోయి, నీటి ప్రవా హానికి అడ్డంకిగా మారిపోయాయని, వాగు మీద చెప్టా కూడా ప్రమాదకరంగా తయారైందని, అదేవిధంగా 4వ లైన్‌లో భారీగా చెత్తా కొట్టుకొని వచ్చి, చెప్టాల క్రింద నిలిచిపోవటం వలన ఆ మురుగు నీరు మొత్తం రోడ్ల మీద ప్రవహిస్తున్నదని స్థానిక ప్రజలకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. అధికారులు వర్షాకాలంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందు బాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోపూరి నరేంద్ర, చింతకాయల శివ, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

**ఇస్కాన్ సంస్థ ఆధ్యాత్మిక సేవలు భేష్ :** మంగళగిరిలోని కొలనుకొండలో హరే కృష్ణ గోకులంలో వేంకటేశ్వరస్వామి ఆలయ అనంత శేషస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎమ్మెల్యే నసీర్‌ను కలిసిన దళిత సంఘాల ప్రతినిధులు

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ ఆయన క్యాంపు కార్యాలయంలో భీమ్ భారత్, దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుంటూరు నగరంలోని కొన్ని సమస్యలపై వినతిపత్రం భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ అందజేశారు. అనంతరం పాగళ్ళ ప్రకాష్ మాట్లాడుతూ గుంటూరు ఏసీ కళాశాల ఎదురు ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్ నిర్మాణం మధ్యలో ఆగిపోవటం వలన శిధిలవస్థకు చేరుతుం దని, భవనం నిర్మాణం చేయుటకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరగా పూర్తి చేయగలరని విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ భవనంలో పేద విద్యార్థులకు గ్రూపు-1, గ్రూపు-2 పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారని తెలిపారు. అంబేద్కర్ భవన్ అసంపూర్తిగా ఉండటం కారణంగా విద్యార్థినీ, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపధ్యంలో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవనాన్ని త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని కోరారు. కోడిగుడ్డు సత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ నిర్మాణం 90శాతం పూర్తయిందని, మిగిలిన కొద్దిపాటి పనులు పూర్తి చేస్తే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకంమన్నారు. కార్యక్రమంలో ఉగ్గం సాంబశివరావు. సాధు మాల్యాద్రి, తాటికొండ నరసింహారావు, నల్లపు నీలాంబరం, డెన్నిస్ రాయ్, పాటిబండ్ల కోటేశ్వరరావు, చిన్నం డేవిడ్ విలియమ్స్, బాపట్ల ఏసుబాబు, ఉప్పలపాటి మున్ని తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా భారతి నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

- చైర్మన్‌గా గోపాలకృష్ణ, జనరల్ సెక్రటరీగా వేణుగోపాలరావు

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** స్థానిక స్నాప్ ఫిట్‌నెస్ సెంటర్ నందు గుంటూరు జిల్లా క్రీడా భారతి నూతన కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. గుంటూరు జిల్లా క్రీడా భారతి చైర్మన్‌గా గోల్డ్‌జిమ్ అధిపతి ఎం.గోపాలకృష్ణ, ప్రెసిడెంట్‌గా చల్లా వెంకటేశ్వరరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ సంబూరు సుబ్బారావు, జనరల్ సెక్రటరీగా కొసనా వేణుగోపాలరావు, ట్రెజరర్‌గా ఎం.రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలుగా బీసీ మెంబర్‌ను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నిక కాబడిన వారు ఆదివారం విజయవాడలో జరుగు ఆల్ ఇండియా క్రీడా భారతి సమావేశంలో పాల్గొంటారని గుంటూరు జిల్లా క్రీడా భారతి సెక్రటరీ కొసనా వేణుగోపాలరావు వెల్లడించారు.

## కిలాడి లేడీ ఘరానా మోసం

**విశాలాంధ్ర-మంగళగిరి :** మంగళగిరి పట్టణంలో టిడ్కో గృహాలలో బ్యాంకు లోన్ల పేరుతో మహిళలను కిలాడి లేడీ బురిడీ కొట్టించింది. గుంటూరుకు చెందిన కిలాడి లేడీ రూ.3 వేలు కడితే రూ.2 లక్షల బ్యాంక్ లోన్ ఇప్పిస్తానంటూ ఘరానా మోసానికి పాల్పడింది. మంగళగిరి టిడ్కో సముదాయంలోని 80 మంది మహిళల నుంచి డబ్బులు తీసుకుని కిలాడీ లేడీ కొండవీటి శైలజ శనివారం పరారైంది. ఆ కిలాడి చేతిలో మోసపోయినట్లు తెలుసుకున్న బాధిత మహిళలు లబోదిబోమంటున్నారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా శస్త్ర చికిత్స

- జీజీహెచ్‌లో ఇదే తొలిసారి

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలో ఈఎన్‌టీ (ముక్కు, గొంతు, చెవి)విభాగం వైద్యులు పేషంట్‌కు రూ.5 లక్షలు ఖర్చయ్యే శస్త్ర చికిత్సను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా ఉచితంగా చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం ఈఎన్‌టీ విభాగం వార్డులో హెచ్‌ఓడి డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్‌తో కలిసి ఆపరేషన్ వివరాలను సూపరింటెండెంట్ వెల్లడించారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గౌస్‌పీర్ ముక్కు వ్యాధితో గత నెల 22వ తేదీన జీజీహెచ్‌కు వచ్చారు. అంతకు ముందు ప్రొద్దుటూరులో చూపించారు. అక్కడ వైద్యం పరంగా ఎటువంటి ఫలితాలు కనపడలేదు. నిరాశతో ఉన్న కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ విభాగానికి వచ్చారు. ఈఎన్‌టి ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్ పేషంట్‌ను పరీక్షలు చేసి రక్తం వచ్చే గడ్డ ముక్కు నుంచి నోట్లోకు వెళ్లిందని నిర్ధారించారు. ఒక్కొక్కసారి గుండెకు సంబంధించి కూడా సమస్యలు ఉంటాయని, ఈ రిస్క్ గురించి కుటుంబ సభ్యులకు వివరిం చారు. కుటుంబ సభ్యుల అనుమతి తీసుకుని గత శుక్రవారం ఈఎన్‌టీ, కార్డియాలజీ విభాగం వైద్యులు సంయుక్తంగా ఆపరేషన్ విజయవంతం చేశారు. తర్వాత ఎండోస్కోపి, మైక్రో డబ్రిడర్ పరికరాలతో రక్తం వచ్చే ట్యూమర్‌ను తొలగించారు. దీంతో పేషంట్ ఆరోగ్యం కుదుటపడింది. రెండు మూడు రోజుల్లో పేషంట్‌ను డిశ్చార్జి చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్యులను సూపరింటెండెంట్ అభినందిం చారు. కార్డియాలజీ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ శ్రీకాంత్, ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫె సర్లు డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ అరుణ్ కుమార్, మత్తు వైద్యుడు శ్యాం కుమార్‌లు ఉన్నారు.

## ఇంటింటికి విస్తృత సర్వే

**విశాలాంధ్ర-తాడేపల్లి :** మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఏ.శ్రీమన్నారాయణ స్థానిక హెల్త్ సెక్రటరీ, ఆశ వర్కర్స్ శనివారం పెనుమాక గ్రామంలో జ్వరం కేసులు అని మీడియా వార్తలకు స్పందించి విస్తృతంగా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. స్థానికుల సమాచారం ఇంటింటికి తిరిగి సేకరించిన సమాచారాన్ని బట్టి తొలకరి వర్షాలకి తడవడం మూలాన వచ్చిన జలుబు, దగ్గు మొదలైన లక్షణాలుగా అధికారులు గుర్తించారు. వెంటనే స్పందించిన అధికారులకు పెనుమాక గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కుల నిర్మూలనతోనే సమసమాజ నిర్మాణం

- విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** భారతదేశంలో కుల నిర్మూలనతోనే సమసమాజం సాధ్యమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ అన్నారు. శనివారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ అధ్యక్షతన నగరంలోని బ్రాడీపేట సీపీఎం హాలులో కుల నిర్మూలనా 800 ప్రతులు ఆవిష్కరణ సభ జరిగింది. కుల నిర్మూలన పుస్తక ప్రతుల ఆవిష్కరణ అనంతరం ముఖ్యఅతిథి హాజరైన పీవీ రమేష్ మాట్లాడుతూ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పోరాటాలు ఒకే ఒరవడిలో జరగాలని విశ్లేషించారు. అంబేద్కర్ జీవించిన కాలంలో మతాలు చాలా తక్కువని ప్రధానంగా కులాలే సమాజంగా ఉందని వివరించారు. దేశంలో బుద్ధిజం ఒక్కటే దేవుడు లేకుండా నైతికంగా ఎలా జీవించాలో మార్గం చూపించిందని అన్నారు. కుల నిర్మూలన పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదివి తీరాలన్నారు. బ్రిటీష్ వారు వచ్చిన తర్వాతే కులం గురించి అధ్యయనం బాగా పెరిగిందన్నారు. 19వ శతాబ్ది నుంచి కుల వ్యవస్థలో మార్పులు జరగడం ఎక్కువైందని అన్నారు. కుల నిర్మూలన జరిగి తీరుతుందని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, వీసీకే పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.జయసుధ, కొరివి వినయ్ కుమార్, పాటిబండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యాన్ని పట్టించుకోని అధికారులు

**విశాలాంధ్ర-గుంటూరు సిటీ:** నగర పాలక సంస్థ అసమర్ధ పాలకుల చేతిలో చిక్కి కున్నారిల్లుతుందని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం లోపించటంతో ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నా నగర కమీషనర్‌కి కానీ, మేయర్ కి కానీ చీమకుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. శనివారం ఆయన జనసేన, టీడీపీ నాయకులతో కలిసి శ్రీనివాసరావుతోట, కేవీపీ కాలనీతో పాటూ పలు ప్రాంతాల్లో పర్యటించారు. వెహికల్ షెడ్డులో పాడైపోయిన ట్రాక్టర్లను, ఈ ఆటోలను పరిశీలించారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వస్తుందని, వాన పడటంతో దోమలూ, ఈగలూ విజృంభిస్తు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిపన్ను, నీటి పన్ను, చివరికి చెత్త పన్నులు కూడా ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు ప్రజలకు అదే స్థాయిలో మౌలిక వసతులు కూడా కల్పించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. చివరికి రక్షిత మంచినీరు కూడా అందించలేని దుస్థితిలో నగరపాలక సంస్థ పాలకులు ఉండటం దురదృష్టకరమన్నారు. జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ షర్ఫుద్దీన్, చెన్నం శ్రీకాంత్, గడ్డం రోశయ్య, ఫణి, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు షేక్ నన్నే , సయ్యద్ చాంద్, సాయి పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యం... 9 నెలలు నిండు గర్భిణి మృతి

**విశాలాంధ్ర-మంగళగిరి :** మంగళగిరి పట్టణం రత్నాల చెరువులో నివసిస్తున్న మైల నిరీష్ 9 నెలల నిండు గర్భిణి... వైద్యం కోసం వెళ్లగా, డాక్టర్ల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు పోయిన ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే నిరీష్ మృతి చెందిందని నిరీష్ భర్త గోపాలకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. భర్త మైల గోపాలకృష్ణ మాట్లాడుతూ పెదకాకాని మండల పరిధిలో గల కాళీ గార్డెన్స్, ఎస్ఎస్ఎస్‌హెచ్ కేవీపీబీ ట్రస్ట్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ కోసం జాయిన్ చేశామని చెప్పారు. తల్లి బిడ్డకు ఎటువంటి ప్రమాదం లేదని అంతా క్షేమంగానే ఉందని శుక్రవారం మధ్యాహ్నం నుంచి డాక్టర్ చెప్పారన్నారు. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు వచ్చి తల్లి బిడ్డ ఇద్దరూ మృతి చెందారని మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఆసుపత్రి సిబ్బంది చెప్పినట్లుగా తెలిపారు. అప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేయించారని తెలిపారు. రాత్రి అంతా బాగానే ఉందని చెప్పి ఇప్పుడు ఎలా చనిపోయిందని బంధువులు ప్రశ్నించగా ఆసుపత్రి సిబ్బంది ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన చేసినట్లుగా తెలిపారు. కొన్ని గంటలపాటు ఆందోళన చేసిన తర్వాత ఆసుపత్రి యాజమాన్యం బాధితులతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు గోపాలకృష్ణ తెలిపారు.

## ముగిసిన 4వ గణిత విభాగం అంతర్జాతీయ సదస్సు

**విశాలాంధ్ర-తాడేపల్లి :** కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో నాలుగవ అంతర్జాతీయ గణిత విభాగ సదస్సు శనివారం ఘనంగా ముగిసింది. ఈ సదస్సుకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్(టెక్నికల్) డాక్టర్ జి.రవి ముఖ్యఅతిథిగా హాజరై ఇంజినీరింగ్‌లో గణితం ఆవశ్యకతను ఇతర విభాగాలతో అనుసంధానమైన సమస్యల మీద ప్రసంగించారు. పంజాబ్‌లోని జలందర్‌లోని ఎన్ఐటిలోని మ్యాథమెటిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.శివరాజ్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్‌ల ద్వారా జీట్, మాస్ ట్రాన్స్‌ఫర్‌పై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కేరళ విశ్వవిద్యాలయం, కేరళలోని గణితశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ సింగ్ సమాచార సిద్ధాంతంపై ప్రసంగం చేశారు. పోస్ట్ లంచ్ సెషన్‌లో, ప్రతినిధులందరూ హైబ్రిడ్ మోడ్ ద్వారా తమ పరిశోధన ఫలితాలను సమర్పించారు. తమిళనాడులోని సవీత విశ్వవిద్యాలయంలోని మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృష్ణ కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్, సైన్స్ విభాగాలలో పైథాన్ ప్రోగ్రామింగ్ అప్లికేషన్‌లతో డేటా అనలిటిక్స్‌పై ఉపన్యాసం ఇచ్చారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాలను గురించి వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, సైన్స్ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బీవీ అప్పారావు, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.రేణుక తదితరులు కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలి

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించి 32 మంది యువ కిశోరాల ప్రాణత్యాగంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా ఉండాలంటే ప్రధాని మోడీ స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో జరిపిన సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రశ్నేలేదని, విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖామంత్రి హెచ్‌డీ కుమార స్వామి మీడియా సమావేశంలో పేర్కొనటం సంతోషకరమే అయినా ప్రధాని నిర్ణయంతోనే ఇది సాధ్యమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ప్రధానిని ఒప్పించి లేదా ఒత్తిడి తెచ్చి ఏవిధంగానైనా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## వ్యవసాయ రంగాభివృద్ధికి సమష్టి కృషి : కేసన శంకరరావు

**విశాలాంధ్ర-గుంటూరు సిటీ:** రైతే రాజు.. రైతే దేశానికి వెన్నుముక... రైతు బాగుంటేనే దేశం బాగున్నట్లుగా భావించాలన్న పలువురు మహానుభావుల నానుడి మేరకు, వ్యవసాయరంగాభివృద్ధికి రైతులతో పాటు ప్రభుత్వం సమష్టికృషి జరపాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. సచివాలయంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని బీసీ సంక్షేమ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ ఆనాటి కానాటికి వ్యవసాయ రంగా అభివృద్ధి తిరోగమన దిశలో కొనసాగుతున్నదన్నారు. రైతులు మరింతగా ఆర్థికంగా బక్కచిక్కిపోతూ, దురదృష్టవశాత్తు కొన్ని ప్రాంతాలలో అప్పులు తీర్చలేక, వ్యవసాయం లాభసాటిగా లేక ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు మంచి రోజులు రానున్నాయని శంకరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్రప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, తూను గుంట్ల బ్రహ్మానందశర్మ, బందారు సోమరాజు, పారేపల్లి మహేష్, ఉన్నారు.

## ఘనంగా మాదల శకుంతలమ్మ సంస్మరణ సభ

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** గుంటూరు పెదకాకానిలోని శంకర కంటి హాస్పిటల్‌లో జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మాదల శకుంత లమ్మ సంస్మరణ సభ శనివారం ఘనంగా జరిగింది. జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ మాదల రత్నగిరి బాబు, మేనేజింగ్ డైరెక్టర్ మాదల సుధాకర్, హాస్పిటల్ సీఈఓ డాక్టర్ పొట్టి సుధాకర్ మాదల శకుంతలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హాస్పటల్ సహాయక సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. రత్నగిరి బాబు మాట్లాడుతూ గతంలో శంకర కంటి హాస్పిటల్‌కు కోట్లాది రూపాయలు విలువ చేసే 5 ఎకరాల స్థలాన్ని జనచైతన్య హౌసింగ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మాదల సుధాకర్, డైరెక్టర్ మాదల శకుంతలమ్మ విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ అస్త్రమే ఓటు హక్కు

- ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** చరిత్ర నిద్రా సముద్రం నుంచి పెను తుపానులా లేవగల అస్త్రం రాజ్యాంగమనేది ఒకటుందనే విషయాన్ని పాలకులు, ప్రజలు మరువరాదని ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్ అన్నారు. బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోరంట్లలోని డి స్క్వేర్ కన్వెన్షన్ హాల్లో 'రాజ్యాంగమే ప్రతిపక్షమా? (జడ్జిమెంట్ 2024)' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు శనివారం జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన తొలి సెషన్ 'లోక్ సభలో సంకీర్ణం రాజ్యాంగ విజయమేనా?', మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్ 'తెలుగు రాష్ట్రాల ఫలితాలలో కుల సమీకరణాలు-కుటుంబ రాజకీయాలు' అంశాలపై సతీష్ చందర్ ప్రధాన వక్తగా మాట్లాడుతూ ప్రజలు స్పష్టమైన, తిరుగులేని మెజారిటీలు ఇచ్చి ఆయా పార్టీల నేతలను చట్టసభలకు పంపితే వైరిపక్షాలను చంపేస్తున్నారని ఆయనన్నారు. రైతులు తమ దీర్ఘకాల సమస్యలపై యేడాదికి మించి దేశ రాజధాని ఢిల్లీలో రోడ్లపై బైఠాయిస్తే వారిపై 'ఉగ్రవాద' ముద్ర వేశారని, ఆదివాసులు అడవి తమదేనని బహుళజాతి సంస్థల్ని అడ్డుకుంటే 'తీవ్రవాదులు'గా నిందలు మోపారన్నారు. ఈ సదస్సులో సీనియర్ పాత్రికేయులు నిమ్మరాజు చలపతిరావు, బ్లూ వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి మల్లికార్జునరావు, ప్రధాన సలహాదారు డాక్టర్ శివరామ కృష్ణారావు, ప్రధాన సాంకేతిక, న్యాయ సలహాదారు బోడపాటి సుధీర్ కుమార్, పత్రికా-సాంస్కృతిక కార్యదర్శి సీహెచ్ రాజేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటం ఆవిష్కరణ

**విశాలాంధ్ర-తెనాలి :** తెనాలి కొత్తపేటలోని ది.కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రధాన కార్యాలయ భవనము నందు శనివారం మాజీ మంత్రివర్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ, గత 23 సంవత్సరాల క్రితం స్థాపించిన ఈ కో-ఆపరేటివ్ బ్యాంకు అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రజలకు బ్యాంకింగ్ రంగంలో పలు సేవలు అందజేస్తూ ఎంతో సేవ చేస్తుందని, భవిష్యత్తులో కూడా ప్రభుత్వ సహకారంతో ప్రజలకు మరింత సేవలందించాలని కోరారు. బ్యాంకు చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ, ఈ సంస్థ తెనాలి, అంగలకుదురు, కొల్లూరు, బాపట్ల, కొల్లిపర, రేపల్లె, మంగళగిరి తదితర బ్రాంచిలను ఏర్పాటు చేసి ప్రజలకు పలు రకాల రుణాలను అందజేస్తున్నామని తద్వారా ముందు ముందు మరిన్ని బ్రాంచీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సహకారంతో ప్రజలకు మరింత సేవలందిస్తామని చెప్పారు. మా సంస్థ అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దావులూరి చక్రధర్ చౌదరి, గ్రంధి చంద్రమౌళి, షేక్ ఖలీల్, వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, బ్రహ్మాచార్యులు మరియు ఇతర డైరెక్టర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాలాంధ్ర పల్నాడు జిల్లా

## ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు ధన్యవాదాలు తెలిపిన సీపీఐ, అరసం నేతలు

**విశాలాంధ్ర-పెదకూరపాడు** : అమరావతి రాజధానికి సమీపంలో ఉన్న నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలును ఆపాలని నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్‌ను కోరారు. పల్నాడు జిల్లాలో రైల్వేకు సంబంధించిన పలు సమస్యలపై ఇచ్చిన వినతిపత్రంలో పెదకూరపాడు అంశాన్ని చేర్చడమే కాకుండా ప్రత్యేకంగా ప్రస్తావించారు. పెదకూరపాడు జర్నలిస్టుల అభ్యర్థనను ఏపీయూడబ్ల్యూజే నాయకులు నిమ్మ రాజు చలపతిరావు ఇటీవల ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు దృష్టికి తీసుకువెళ్ళారని అఖిల భారత రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతిశ్రీ ధన్యవాదాలు తెలియజేశారు. ఇచ్చిన హామీని శ్రీకృష్ణదేవరా యలు ఆచరణలో చూపారని, అందుకు ఎంపీలావు శ్రీకృష్ణదేవరాయలుకు, పాత్రికేయ మిత్రుడు, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, తెలుగు దేశం పార్టీ నాయకులు అత్తిమల రమేష్, బెల్లకొండ రామ్‌గోపాల్ రావు, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య పెదకూరపాడు ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

## నేడు పులుపుల వెంకట శివయ్య వర్ధంతి

**విశాలాంధ్ర-వినుకొండ** : ఈనెల 14న ఉదయం 10 గంటలకు వినుకొండలోని సీపీఐ ఆఫీసులో పులుపుల వెంకట శివయ్య 49వ వర్ధంతి సభ జరుగుతుందని దీనికి ముఖ్య అతిథులుగా సీపీఐ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ హాజరవుతున్నారని సీపీఐ పార్టీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు తెలిపారు. బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు వినుకొండ ప్రాంతంలో గ్రామ సర్పంచిగా, ఎమ్మెల్యేగా, ప్రజల హృదయా లలో జీవించిన ప్రజా నాయకుడు పల్నాడు వెలలేని మాగాని రా అంటూ ప్రజల గొంతు కను అక్షరీకరించిన అభ్యుదయ రచయిత పులుపుల వెంకట శివయ్య అని ఈ వర్ధంతి సభకు సీపీఐ పార్టీ నాయకులు, శాఖ సభ్యులు, సీపీఐ పార్టీ సానుభూతిపరులు, అభిమానులు, అందరూ పాల్గొని శివయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని బూదాల శ్రీనివాసరావు కోరారు.

## పారిశుధ్యంపై ఎమ్మెల్యే చదలవాడ అసహనం

**విశాలాంధ్ర-నరసరావుపేట:** ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే తన ముందున్న తక్షణ కర్తవ్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని బాబా పేట ఫ్లై ఓవర్ క్రింద వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడటం పై అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. అందుకే ఇప్పుడు ప్రజలకు నిత్య నరకం తప్పడం లేదన్నారు. ప్రజల అవస్థల్ని దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు నేతృత్వం లోని ప్రజా ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని అన్నారు.

## డాక్టర్ పి.రంజన్‌బాబు సేవలు ప్రశంసనీయం

**విశాలాంధ్ర-ఫిరంగిపురం:** కార్డు సంస్థ అధినేత డా.పి.రంజన్‌బాబు సేవలు ప్రశంసనీయమని వైస్ చాన్స్‌లర్ గుజ్జర్లపూడి కృపాచారి కొనియాడారు. రంజన్‌బాబు 77వ జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలో ఆయా ప్రాంతాల్లో వివిధ హోదాల్లో స్థిరపడిన నిష్ణాతులైన దళిత నేతలకు కార్డు సంస్థ తరుపున అవార్డు గ్రహీతలకు జాతీయ పురస్కారాలు శనివారం అందజేశారు. స్థానిక దీనాపూర్ కళాశాలల కమ్యూనిటీ హాలులో 38వ స్నాతకోత్సవ వేడుకలకు విచ్చేసిన అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ డా.రంజన్‌బాబు డా.బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను నెరవేరుస్తూ ఎంతో మంది దళిత పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అనంతరం డా.చుండూరు మాణిక్యరావు, డా.వై.కిరణ్‌కుమార్, డా.పి.రమేష్‌బాబు, శ్రీకె.సుధాకర్, శ్రీ కె.విల్సన్ రావు, వై.జ్యోతి అమలోర్పవ మేరి, శ్రీమతి ఆర్. కమలావల్లి, డా.ఇ.అనంతనాగ్, శ్రీ.యం. శ్రీనివాస రావు అవార్డు గ్రహీతలకు పురస్కారాలు అందించి డా.స్వర్ణలతా దేవి, డా.కృపాచారి, కార్డు సంస్థ సిబ్బంది తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో కార్డు డైరెక్టర్ కె.మేరి, డిప్యూటీ డైరెక్టర్ టి.అమరనాథ్, కార్డు ప్రెసిడెంట్ డి.రజిని, సెక్రటరి అండ్ కరస్పాండెంట్ యం.సత్యవాణి, ఆర్సీజెసి కళాశాల ప్రిన్సిపాల్ యం.డి.సుదర్శన్, ఫార్మశీ ప్రిన్సిపాల్ డి.జీవన్ మణిబాబు, వార్డెన్ యం.నాగేశ్వరావు, వి.అనిత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు శ్రీ గంగానమ్మ గుడి పున:నిర్మాణం ప్రారంభోత్సవం



**విశాలాంధ్ర-తాడేపల్లి** : తాడేపల్లి, నేతాజీ సెంటర్‌లో గల శ్రీ గంగానమ్మ గుడి పున:నిర్మాణం ప్రారంభోత్సవం ఈ నెల 14వ తేది ఉదయం 9 గంటలకు జరుగుతుందని శ్రీ శ్రీ శ్రీ గంగానమ్మ పోతురాజు మహలక్ష్మి గ్రామ దేవతల సేవా సమితి కమిటీ సభ్యులు చింతా శ్రీరాం, పలగాని నాగబాబు, తాడిబోయిన నాగ కోటేశ్వరరావు(బాబు ) తెలిపారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి మంగళస్నానం, 7 గంటలకు గుడి సంప్రోక్షణ, 8 గంటలకు అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పణ, 9 గంటలకు అమ్మవారికి నైవేద్యం సమర్పించుట, 10 గంటలకు ఊరేగింపుతో గ్రామ ప్రజలు అందరూ నైవేద్యం సమర్పించుట, మధ్యాహ్నం 12 గంటలకు గౌడ కళ్యాణమండపం వద్ద అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యావన్మంది భక్తులు పాల్గొనవలసిందిగా వారు విజ్ఞప్తిచేశారు.

# పేదల ఆరోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి

### - మంత్రి నారాయణ

**విశాలాంధ్ర-పిడుగురాళ్ల** : పేదల ఆరోగ్యం పట్ల చిత్తశుద్దితో పనిచేస్తున్న ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమని మంత్రి నారాయణ అన్నారు. లెనిన్ నగర్‌లోని అర్బన్ హెల్ప్ సెంటర్ సందర్శించి అక్కడ డయేరియా బాధితులను పరామర్శించిన అనంతరం అధికారులతో మంత్రి నారాయణ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ దాదాపుగా డయేరియా వ్యాధి అదుపులోకి వచ్చిందన్నారు. లెనిన్ నగర్, మారుతి నగర్ ప్రాంతాల్లో 15 కిలోమీటర్ల డ్రైనేజ్ సిస్టం ఉందని, పట్టణంలో 175 కిలోమీటర్ల మేర ఉన్నటువంటి డ్రైనేజీలో పూడికను త్వరితగతిన తీసివేయడానికి అంచనాలు పంపవలసి ందిగా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతానికి డ్రైన్‌లలోని పూడికతీతకు రూ.10 లక్షలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. డయేరియా వ్యాధి రాటానికి ప్రధాన సమస్య నీటి కాలుష్యము, అదేవిధంగా పైప్ లైన్లకు లీకులు రావడం మూలంగా ట్యాంకుల్లోకి నీరు వెళ్లి మలినం అవుతుందని తద్వారా నీరు కాలుష్యం బారిన పడుతుందన్నారు. లెనిన్ నగర్, మారుతి నగర్ ప్రాంతంలో ఎనిమిది పవర్ బోర్లు, 36 హ్యాండ్ బోర్లు ఉన్నాయనన్నారు. దీనిలోని నీటిని పరీక్ష నిమిత్తం పంపించగా ఎనిమిది బోర్లలో నైట్రేట్ వచ్చిందని తెలిపారు. నీరు కాలుష్యం అయినట్లుగా నివేదికలో వచ్చినట్లుగా ఆయన తెలిపారు. ప్రస్తుతం వైద్యశాలలో ఉన్నటువంటి డయేరియా బాధితుల ఆరోగ్యం అంత కూడా స్థిరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. రెండు కాలనీలో కాకుండా పట్టణం లోని అన్ని హ్యాండ్ బోర్లలో నీటిని టెస్ట్ చేయించవలసిందిగా ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధతో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందువల్లనే వారి యోగ క్షేమాలను చూసేందుకు మరల రెండవసారి మంత్రి పిడుగురాళ్లలో సందర్శించారన్నారు. లెనిన్ నగర్, మారుతి నగర్ అదేవిధంగా పట్టణంలోని పీడబ్ల్యూ కాలనీ, పట్టణం, గురజాల నియోజక వర్గం ప్రజలు అందరూ కూడా డయేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. కాలువల్లో ఉన్న పూడికను తీసివేసి అదేవిధంగా తాగునీరు కాలుష్యం కాకుండా చూడాలని సంబంధిత సూచించారు. రెండు రోజుల్లో డయేరియా వ్యాధిని అధికారులు సిబ్బందితో కలిసి పూర్తిగా నియంత్రిస్తామని అన్నారు. బాధితులు అధైర్యపడాల్సిన పనిలేదని వారికి మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

## జీపీఎస్‌పై ప్రభుత్వ నిర్ణయం సమంజసం కాదు: ఎస్టీయూ

**విశాలాంధ్ర-చిలకలూరిపేట** : జీపీఎస్‌పై ప్రభుత్వ నిర్ణయం ఏ మాత్రం సమంజసం కాదని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు విమర్శించారు. ఎస్టీయూ సమావేశం పట్టణం లోని సీపీఐ కార్యాల యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారెంటీ పెన్షన్ పథకం(జీపీఎస్) గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన నోటిఫికేషన్‌ను తాజాగా ఇప్పుడు గెజిట్‌లో అప్‌లోడ్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. అవిగాక జీపీఎస్ పథకం గత ఏడాది అక్టోబర్ 20 నుంచి అమలులోకి వస్తుందని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చి గత ఏడాది అక్టోబర్ నుంచి అమలులోకి వస్తుం దనటం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు నష్టపోతారని పేర్కొన్నారు. సంఘ పూర్వ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ జీపీఎస్ అమలుకు విధివిధానాలు రూపొందించకుండా ప్రభుత్వం ఎలాంటి చర్చ జరపకుండా నిర్ణయం తీసుకోవడం నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయమన్నారు. జీపీఎస్ అమలుకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. సంఘ జిల్లా కార్య దర్శి వినుకొండ అక్కయ్య, జిల్లా కౌన్సి లర్ షేక్ జమీర్ భాష, నాయకులు చావలి మల్లేశ్వరరావు, మేకల కోటేశ్వంరావు, వడ్లాన జయ ప్రకాశ్, ఇనకొల్లు అంకమ్మరావు, పి.సాగర్ బాబు, కె.ఏడు కొండలు, సొమ్ల నాయక్, అట్లూరి శ్రీనివాసరావు, ఫరిసా పాల్గొన్నారు.

## ఆర్టీసీలో పనిచేయని జనరేటర్

**విశాలాంధ్ర- వినుకొండ** : వినుకొండ ఆర్టీసీ డిపోలో విద్యుత్ సరఫరా చేసే జనరేటర్ చెడిపోయి రెండు నెలలు గడుస్తున్న నేటి వరకు రిపేరు చేయించకపోవడంతో కరెంటు పోయే సమయాలలో బస్టాండ్ లో ప్రయాణికులు, గ్యారేజీలో బస్సులు మరమ్మతులు చేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పలు వురు తెలిపారు. ఇటీవల ఓ మెకానిక్‌ను తీసుకువచ్చి పదివేలు ఖర్చు చేసి రిపేరు చేసినప్పటికీ, డైనమాలో ప్లేట్లు మెల్ట్ అవుతూ జనరేటర్ మొరాయిస్తుంది. దీంతో రెండు మాసాలుగా బస్టాండ్‌లోని ప్రయాణికులు కరెంటు పోయే సమయాలలో పగలు ఫ్యాను తిరక్క, రాత్రులందు చీకట్లో ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వినుకొండ డిపో లో సుమారు 90 బస్సులు వరకు ఉంటాయి. ఇవి కాకుండా ప్రతిరోజు పగలు, రాత్రులందు ఇతర డిపోల నుండి 200 బస్ సర్వీసులు వినుకొండ డిపోకి వచ్చి వెళుతుంటాయి. రాత్రులందు బస్సులతో బస్టాండు నిండిపోయి ప్రయాణికులు కరెంటు పోయిన సందర్భంలో పలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో, జేబు దొంగలకు పని సులువైపోతుంది. అలాగే కార్గో పార్సిల్ సర్వీసు వద్ద పార్సిల్స్ అన్ని ప్లాట్ఫారం మీదే ఉంటుంటాయి. కరెంటు పోయిన సమయాలలో చీకట్లో ఆ పార్సెల్స్ చోరీకి గురయ్యే ప్రమాదం లేకపోలేదు. కాగా ఈ విషయాన్ని డిపో మేనేజర్ కోటేశ్వర నాయక్‌ను వివరణ కోరగా జనరేటర్ చెడిపోయి రెండు మాసాలైనా విషయం వాస్తవమని, రిపేరుకు బడ్జెట్ ఎక్కువగా ఉన్నందున ఆలస్యం జరిగిందని, రెండు రోజుల్లో జనరేటర్ బాగు చేపిస్తామని తెలిపారు.

## డయేరియా బాధితులకు మంత్రి, ఎమ్మెల్యే పరామర్శ

**విశాలాంధ్ర-పిడుగురాళ్ల:** పిడుగురాళ్ల పట్టణం పిల్లుట్ల రోడ్డులోని లెనిన్ నగర్, మారుతి నగర్, ఎస్సీ కాలనీల్లో డయేరియా బాధితులను శనివారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, అర్బన్ డెవలప్మెంట్ మంత్రి పొంగూరు నారాయణ, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాస రావు, సంబంధిత అధికారులు, హాస్పటల్ నందు చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిం చారు. వారికి అందుతున్న వైద్య సేవలను గురించి ఆడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించ వ లసిందిగా మంత్రి వైద్యధికారులను ఆదేశించారు. అనంతరం లెనిన్ నగర్, మారుతి నగర్ లోని డయేరియా ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు శానిటరీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఇంకా కాలువల్లో ఉన్నటువంటి పూడికను తీయక పోవడం చూసి మంత్రి స్వయంగా పూడిక తీశారు. మిగిలివున్న కాలువలలోని పూడికను త్వరిత గతిన తీసి వేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. తిరిగి మూడు రోజుల అనంతరం పిడుగురాళ్లకు వస్తానని ఆలోపు ఏ విధమైన మురుగు లేకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆర్‌అండ్‌బి బంగ్లా నందు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

# రోడ్డు బాగుచేయండి మహాప్రభో...

**విశాలాంధ్ర-సత్తెనపల్లి** : సత్తెనపల్లి-భీమవరం రోడ్ గుంతలమయంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మా రోడ్డు బాగుచేయండి మహాప్రభో అంటూ అధికారులను వేడుకొంటు న్నారు. భీమవరంలో ప్రసిద్ధి పొందిన అంకమ్మ తల్లి దేవాలయం ఉంది. నిత్యం సత్తెనపల్లి నుంచి భక్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఈ దేవాలయంకు భక్తులు రాష్ట్ర నలు మూ లల నుంచి వచ్చి దర్శించుకుంటూ ఉంటారు. అంతేకాకుండా భీమవరం, సత్తెనపల్లి పట్టణంలోని 1, 2, 3 వార్డుల ప్రజలు నిత్యం ఈ రోడ్డు మార్గాన తమ వాహనాలపై ప్రయాణం చేస్తూ ఉంటారు. సత్తెనపల్లి పట్టణ శివారు ప్రాంతంలో పంట పొలాలు ఉండటంతో రైతులు, స్కూల్, కాలేజీలకు వెళ్లి వచ్చే విద్యార్థులు కూడా ఈ మార్గంలో ప్రయాణం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణించాలంటే నరకాయతన అనుభవించాలి. పెద్ద పెద్ద గుంతలలో వర్షపు నీరు చేరి గుంతలు నిండుతాయి. రాత్రి సమయ ంలో ఈ రోడ్డులో వాహనాలపై ప్రయా ణించే వారు వర్షపు నీరు నిండటంతో గుంతలు కనపడక స్కిడ్ అయి పడి గాయలపలైన సందర్భా లు అనేకం ఉన్నాయి. ఈ సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించు కున్న దాఖ లాలు లేవు. మొక్కుబడిగా గుంత లలో మట్టి వేసి పూడ్చి చేతులు దులుపు కున్నారు. టౌన్ పరిధిలో ఉన్న 2, 3 వార్డుల గుండా సీసీ రోడ్డు నిర్మించాలని, పట్టణ శివారు ప్రాంతం నుంచి భీమ వరం వరకు తారు రోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజాప్రతి నిధులను, అధికారులను ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## కొండెక్కిన కూరగాయల ధరలు... పట్టించుకోని అధికారులు

**విశాలాంధ్ర-వినుకొండ** : స్థానిక శివయ్య స్తూపం సెంటర్‌లో ఉన్న కూరగాయల మార్కెట్ శని, ఆదివారాలు పాటలు పెట్టారంటూ కూరగాయలు అధిక రేట్లకు అమ్ముతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మామూలుగా వినుకొండలో 50 నుండి 60 కూరగా యల దుకాణాలు ఉంటూ ఉంటాయి. అయితే మార్కెట్లోని కమిటీ పెద్దలు శని, ఆదివారాలు 1 లక్ష 80 వేలకు పాట నిర్వహించడంతో కేవలం ఎనిమిది దుకాణాలు మాత్రమే పెట్టి ప్రజల నుండి అందిన కాడికి కూరగాయలు అధిక ధరలకు విక్రయించి దండుకున్నారు. ప్రజలు దుకాణం దారులను ఏంటి దారుణం రేట్లు ఇలా అని ప్రశ్నించడంతో మార్కెట్ నిర్వాహక పెద్దలు శని, ఆదివారాలు పాటలు పెట్టారంట తాము పాట డబ్బులు కట్టవలసి వచ్చిందంటూ బదులిచ్చారు. అయితే ఈ నెల 17వ తేదీ పట్టణంలో తొలి ఏకాదశి పండుగ తిరునాళ్ల, ముస్లింల పండగ రావడంతో, పాట పాడి కూరగాయల ధరలు పెంచారని కొందరు అంటుంటే అలా కాదు ఓ అధికార పార్టీ ప్రజాప్రతినిధికి కూరగా యల మార్కెట్ తరుపున భారీ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందువల్ల ఖర్చవుతుంది కదా అందుకు 1 లక్ష 80 వేల కు పాట నిర్వహించినట్లు పలువురు కూరగాయల మార్కెట్ దుకాణం దారులు పెదవి విరిచారు. కాగా ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ టి కృష్ణవేణి దృష్టికి తీసుకువెళ్లగా, కూరగాయల మార్కెట్ వ్యవహారం రెవెన్యూ వారు చూసుకుంటారు మాకు సంబంధం లేదంటూ తెలిపారు. తహసిల్దార్ బ్రహ్మయ్యను ఈ పాట వ్యాపారం అడగ్గా అబ్బే, కూరగాయల మార్కెట్తో మాకు సంబంధం లేదు, మున్సిపాలిటీ ద్వారా పన్నులు వసూలు చేసేది వారే కదా అంటూ దాటవేశారు. ఇలా అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొని పట్టించుకోక పోవడంతో శనివారం, ఆదివారాలు కూరగాయల ధరలు అధిక రేట్లకు పెంచి దుకాణం దారులు ప్రజలను పీల్చుకుతిన్నారు. కాగా, శనివారం టమాట కేజీ 80 రూపాయలు, చిక్కుడు 120, దొండ 60, వంకాయలు 60, క్యారెట్ 100, బీన్స్ 350, మిర్చి 80, బంగాళాదుంప 60 రూ.లు చొప్పున. అమ్మడం జరిగింది. ఇక ఆదివారం ధరలు ఎలా ఉంటాయో అంటూ ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

## పాడి రైతులు కృత్రిమ గర్భధారణను వినియోగించుకోవాలి

**విశాలాంధ్ర-బొల్లాపల్లి** : పాడి రైతులందరూ కృత్రిమ గర్భధారణను వినియోగించుకోవాలని, పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుని రైతులు ఆర్థికంగా అభివద్ధి చెందాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని రావులాపురం గ్రామంలో లేగ దూడల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పెయ్యి పుట్టిన వెంటనే వాటికి ముర్రుపాలు తాగించాలని, ప్రతి నెల ఎలుక పాముల మందు పట్టించాలన్నారు. ఆడ పెయ్యలు పుట్టాలంటే కొత్త పథకం(పేయ్య దూడల ఉత్పత్తి పథకం) ద్వారా రైతులు ఉపయోగించవచ్చు అన్నారు. పశువులకు పాడి పెయ్యలకు నాలుగు సంవత్సరాలు దాటిన తర్వాత గాలి కుంటి వ్యాధి రాకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. లేగదూడల పెంపకంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్న రైతులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నూజెండ్ల పశువైద్యాధికారి డాక్టర్ శివాజీ, బొల్లాపల్లి మండల పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు

**విశాలాంధ్ర-వినుకొండ** : పట్టణంలో విపరీతంగా పెరిగిపోయిన కుక్కలు పగలు, రాత్రి తేడా లేకుండా పాదాచారులను, వాహన చోదకులను హడలెత్తిస్తున్నాయి. పట్టణంలో ప్రతిరోజు ఎక్కడో చోటకుక్కల దాడిలో ప్రజలు గాయపడుతూనే ఉన్నారు. చిన్నారులు, పాదచారులు అధికంగా కుక్కల దాడిలో గాయపడుతున్నారు. పట్టణంలోని 32 వార్డులలో వీధి వీధినా పదుల సంఖ్యలో మూకుమ్మడి దాడి చేస్తున్నాయి. సంబంధిత శాఖ వారు సత్వరమే స్పందించి కుక్కల్ని నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

## రత్నకుమార్‌ను ఎస్సీ సెల్ నాయకులు పరామర్శ

**విశాలాంధ్ర-పెదకూరపాడు** : మండల పరిధిలోని కాశిపాడు గ్రామానికి చెందిన మండల ఎస్సీ సెల్ నాయకులు రత్న కుమార్ గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా విషయం తెలుసుకున్న నియోజవర్గ తెలుగుదేశం ఎస్సీ సెల్ కార్యదర్శి జంగాల ప్రసాద్ శనివారం గుంటూరు ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రత్నకుమార్‌ను పరామర్శించారు. టీడీపీ పార్టీ అన్ని విధాల అండదండగా ఉంటుందని అన్నారు. అనంతరం డాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

## అన్న సత్రానికి మరమ్మతులు

**విశాలాంధ్ర-శావల్యాపురం** : మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని శ్రీ అడవి పేరంటాలమ్మ దేవాలయ ఆవరణలో ఉన్న శ్రీ కాకతీయ కమ్మవారి అన్నదాన సత్రానికి మరమ్మత్తులు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక కమిటీ సభ్యులు నాగుబడి వీరనారాయణ శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని కమ్మ సామాజికవర్గానికి చెందిన దాతల సహకారంతో అరెకరం పొలాన్ని కొనుగోలు చేసి సత్రం నిర్మాణం చేశా మని, ప్రతిఏటా ఉగాది రోజున జరిగే అడవి పేరంటా లమ్మ తిరునాళ్ళను పురస్కరించుకొని సుమారు 6 వేల మంది భక్తులకు కుల మతాలకు అతీతంగా అన్నదానం చేస్తున్నామన్నారు. రూ.5 లక్షల వ్యయంతో సత్రం ముఖద్వారానికి ఆర్చీ నిర్మాణం, ప్రహరీగోడలకు ప్లాస్టరింగ్, వాటర్ ట్యాంకు, వాటర్ పైప్ లైన్లు, వాష్ బేసిన్ల నిర్మాణా లను చేపిస్తున్నామన్నారు. వ్యవస్థాపక కమిటీ సభ్యులు బోడాల లక్ష్మయ్య, ముంద్రు రవణయ్య, బోడెపూడి వెంకటేశ్వర్లు, సహాయక సభ్యులు పొనుగోటి వెంకట్రావు, చింతా వీరయ్య, దూళిపాళ్ళ అక్కయ్య పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**విశాలాంధ్ర-చిలకలూరిపేట** : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటా లని ఇన్నర్‌వీల్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజని అన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంటెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ తియ్యగూర రమాదేవి, ప్రభుత్వ వైద్యలు డాక్టర్ సత్యదీప్తి, డాక్టర్ సంజూష, దయామయి పాల్గొన్నారు.

## కాపు హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా బ్రహ్మేశ్వరరావు

**విశాలాంధ్ర-పెదకూరపాడు:** ఆంధ్రప్రదేశ్ కాపు హక్కుల పరిరక్షణ సమితి పెదకూరపాడు నియో జకవర్గ అధ్యక్షుడిగా పెద కూరపాడు గ్రామానికి చెందిన కందుల లక్ష్మీకాంత్ బ్రహ్మేశ్వర రావును నియమించి నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండ పల్లి ఫణికుమార్ శుక్రవారం తెలిపారు. ఫణికుమార్ మాట్లాడుతూ కాపు ఉపకులాల సంక్షేమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కందుల లక్ష్మీకాంత్ బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్రఅధ్యక్షులు ఫణికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాపుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.

## నేడు శ్రీదేశమ్మ తల్లి పొంగళ్ళు

**విశాలాంధ్ర-పెదకూరపాడు** : మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామ దేవత శ్రీదేశమ్మతల్లి పొంగళ్ళు ఈ నెల 14వ తేది ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో రెండవ ఆదివారం అమ్మవారికి ఉత్సవం జరుగుతుంది. శుక్రవారం నుంచి ఐదు పూటలా జలబిందెలతో చిన్నలు, పెద్దలు, మహిళలు వారుపోస్తారు. ఆదివారం ఉదయం గ్రామ ఉమ్మడి పొంగలి, పెదకాపు పొంగలి చేసి అమ్మవారికి నివేదన చేస్తారు. అనంతరం భక్తుల మొక్కుబడులు చెల్లించడానికి సామూహికంగా మేళతాళాలతో ప్రభను కట్టుకుని మహిళలు సాంప్రదాయ పద్ధతిలో నైవేద్యాలు(బోనాలు) సమర్పిస్తారు. సాయంత్రం జాతరలో పోతులను సమర్పించి సామూహిక అన్నసంతర్పణ చేస్తారు. గ్రామాన్ని, ప్రజలను పాడి పంటలతో కాచి కాపాడే కొంగుబంగరుతల్లి శ్రీదేశమ్మతల్లికి ఎడాదికో మారు ఉత్సవాలు ఘనంగా జరుపుతారని గ్రామపెద్దలు తెలిపారు.